# స్నేహ చిహ్నం

శార్వాణి



స్సాయంత్రం గంటఆరయినా విజయ ఇంటికి రాలేదు. ఎంచేత చెప్మా అనుకుంటూ ఎదురుచూస్తూ కూర్చున్నాను. ఉదయం నుండి సన్నగా కురుస్తున్న వర్షం ఓ గంట ఆగి మళ్ళీ తుంపర మొదలయింది. మన సంతా కలతగా ఉంది. విజయను చూస్తే గాని నెమ్మది కలిగేలా లేదు. అనుకోకుండా సినిమా ప్రోగ్రాం వేసుకున్నారేమో స్నేహితులంతా కలసి. లేకపోతే రోజూ అయిదింటికల్లా ఇల్లు చేరుకునే విజయ ఈ రోజు ఆరయినా రాకపోవటానికి కారణం కనిపించలేదు, వర్షం పట్టుకుంది. జీడిలాగా. తడుస్తుందో ఏమిటో!

మూడురోజులనుండీ ముసురు పట్టింది. ఈ ముసురు చూస్తుంటే పద్ధెనిమిదేళ్ళనాటి మాట జ్ఞాపకం వస్తోంది. ఇలా వంటరిగా కూర్చుంటే పాత జ్ఞాపకాలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

పద్ధెనిమిదేళ్ళక్రితం మాట అది. ఆరోజు కూడా ఇవాల్టిలాగే జడివాన పట్టుకుంది. మూడురోజులుగా తెరిపిలేకుండా సన్నగా కురుస్తూనే ఉంది. ఉదయం అయిదవుతోంది. పక్కమీదనుండి లేద్దామనుకుంటూండగానే, చుట్టూ ఆవరించిన నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఓ ఆర్తనాదం, నా గుండెల్లోనుండి దూసుకుపోయినట్టనిపించింది. ఒక్కక్షణం మ్రాన్పడిపోయాను. మరుక్షణమే అదెవరికంఠమో స్ఫురించింది.


దుప్పటి లాగిపారవేసి తలుపు తీసుకుని పరిగెత్తాను ప్రక్కవాటాలోకి. అక్కడ కనిపించిన దృశ్యం హృదయవిదారకంగా ఉంది. ఇరవయ్యేళ్ళు నిండని కనకవల్లి తన భర్త గుండెలమీదపడి ఏడుస్తోంది. రెండు నిమిషాలు స్థాణువులా నిలబడిపోయాను. తరువాత తెలివి తెచ్చుకుని దగ్గరగా వెళ్ళి వల్లి భుజంమీద చెయ్యివేశాను. వల్లి తలెత్తి చూసి 'మామీ' అంటూ నా వొళ్లో తల దాచుకుని బావురుమంది. అప్పటికే అంతా అయిపోయింది. డాక్టర్ అవసరంకూడా లేకుండానే అతను యీ లోకంనుండి వెళ్ళిపోయాడు. నేనామెను ఓదార్చే ప్రయత్నమేమీ చెయ్యలేదు. అలాగే ఆమెను పొదివి పట్టుకుని కూర్చున్నాను. ఆమె హృదయ విదారకమయిన రోదనకు అంతులేదనిపించింది.

ఇరుగూ పొరుగూ చేరారు. పొద్దెక్కుతోంది. జరగవలసిన కర్మకాండ జరక్క తప్పదుకదా! నలుగురూ పూనుకున్నారు. మధ్యలో మావారొచ్చి, "వాళ్ళవాళ్ళకెవరయినా టెలిగ్రాం ఇద్దాం. ఆ అడ్రస్ కనుక్కో." అన్నారు.

బెదరిన లేడిలా తలెత్తిచూసింది కనకవల్లి. ఆత్రుతగా "వద్దండీ వద్దు. నాకెవ్వరూ లేరు" అంది బొంగురుపోయిన కంఠంతో.

మావారు నావేపోసారి చూసి అక్కడినుండి వెళ్ళిపోయారు.

జరగవలసిన తతంగమంతా పూర్తయిపోయింది. నిస్సహాయంగా, దీనాతిదీనంగా మిగిలిపోయింది కనకవల్లి. నెలలు నిండిన,



దిక్కులేనిదానిగా తయారయిన ఆ దీనురాలిని చూస్తూ చూస్తూ అల్లా వదిలేయటం నా చేత కాలేదు. రెండు వాటాలకూ మధ్యనున్న తలుపులు తెరిచివేశాను. నిరాశతో క్రుంగిపోతున్న ఆ అమ్మాయి కెంతో ధైర్యం చెప్పాను. పుట్టబోయే పాపమీద ఆశ కలిగించటానికి ప్రయత్నించాను. నిజంగానే వల్లి కళ్ళల్లో వెలుగు కనిపించింది.

"నిజమే మామీ! మీ మాట నిజం. నా పాపకు తల్లిని నేను. నా పాపను కళ్ళారా చూడొద్దూ నేను? అందుకోసమయినా బ్రతకాలి" అంది. ఆమెలో పాపను గురించిన తపనా, ఆలోచనలూ, కోర్కెలూ ఎక్కువయ్యాయేగాని, నీరసపడిపోయిన మనిషి దైహికంగా మాత్రం కోలుకోలేదు. రోజు రోజుకూ మరీ నీరసించిపోసాగింది. నాకు చేతనయినంత నేనూ చేశాను. కాని లాభం లేకపోయింది. ఓ రోజు–

"మామి, మీ కో సంగతి చెప్పాలి. నా దగ్గర కూర్చోండి కాసేపు" అంది. కూర్చున్నాను.

"చనిపోయింది నాకు తాళిగట్టిన భర్త కాదు" అంది.

విస్మయంతో ఆమె మొహం వేపు చూశాను. పలవరింతలు కాదుకదా అని నుదుటిమీద చెయ్యివేసి చూశాను. వల్లి నీరసంగా నవ్వింది. "నాకు మతిపోలేదు మామీ! సరిగ్గానే ఉన్నాను. నా సంగతి మీ కేమీ తెలియదు కదా! అయినా నన్ను చేరదీసి ఎంతో ఆప్యాయంగా చూస్తున్నారు; మీకంతా చెప్పాలనిపిస్తోంది. చెప్పనీయండి," అంది.

"అలాగే. నిన్ను చెప్పొద్దన్నానా? చెబుదువుగానీ. కాస్త కోలుకున్నాక, నువ్వు చెప్పే కథలన్నీ వింటాలే" అన్నాను.

"కాదు మామీ! ఇవాళే చెప్పాలనుంది నాకు." వల్లి పట్టుబట్టింది. సరేననక తప్పలేదు నాకు.

చిన్నప్పుడే తల్లి దండ్రులను కోల్పోయిన కనకవల్లి అన్నావదినల పెంపకంలో పెరిగి పెద్దదయింది. చెప్పుకోదగిన అందగత్తె కాకపోయినా అందవికారికాదు. ఇంట్లో ప్రోత్సాహం లేకపోయినా అష్టకష్టాలు పడి ఎస్సెల్సీదాకా చదువుకుంది. మేనత్తకొడుకు చంద్రంమీద మమతలు పెంచుకుంది. అత నేమీ పెద్దచదువులు చదువుకున్నవాడు కాదు. ఆస్తిపాస్తులూ, వెనకాముందూ లేనివాడు. ఈ కారణాల వల్ల ఆమె అన్నయ్య సంబంధాని కొప్పుకోలేదు. "ఆతని కొచ్చే జీతం మాకుచాలు. అంతగా కాకపోతే నేనూ ఏదో చిన్న ఉద్యోగం వెతుక్కుంటాను. కాదనకన్నయ్యా" అని వల్లి ఎంత బ్రతిమాలుకున్నా లాభం లేకపోయింది.

"అదేం లాభంలేదమ్మోవ్! అతన్ని కట్టుకుంటే మూడోనాటికల్లా ఒకరి కిద్దరయి మా ఇంటిమీదికే పడతారు మళ్ళీ. అసలే గంపెడు సంసారం ఈదలేక చస్తున్నా." అంటూ వదిన అన్నయ్యనే బలపరిచింది.

చంద్రం అసలే అర్భకుడు. నోరులేనివాడు. ఆ నిరాశకు తట్టుకోలేక చేస్తున్న ఉద్యోగంకూడా వదిలి, ఆ ఊరునుండి వెళ్ళిపోయాడు.

అన్నయ్య తెచ్చిన సంబంధానికి మెడ వంచక చేసే దేమీలేకపోయింది. రెండో సంబంధ మయితేనేంగాక, అంత డబ్బుగల వారి సంబంధాన్ని అత నెలా తేగలిగాడో అర్థమవటానికి చాలా రోజులే పట్టింది. భర్త దారుణ ప్రవర్తన వల్లనే మొదటి భార్య ఉరిపోసుకు చచ్చిపోయిందన్న వదంతివల్ల, ఇక మళ్ళీపెళ్ళి ఆశ వదులుకున్న అతనికి మళ్ళీ ఓ ఇంటివాడయ్యే యోగం కల్పించాడు వల్లి అన్నయ్య.

భర్త ఆధిక్యాన్ని, లేనిపోని అనుమానాల్ని మౌనంగా భరించటం నేర్చుకుంది వల్లి. తన తప్పిదం వల్లనే ఒక భార్యను కోల్పోయిన అతనిలో సహజంగా కలగవలసిన మార్పేమీ రాలేదు. ఆ స్థానాన్ని భర్తీ చేసిన వల్లి ఆ బాధలన్నిటికీ గురికాక తప్పలేదు. కాని ఆమె అమితమయిన ఓర్పు అందరికీ వారి దాంపత్యం హాయిగా సాగిపోతున్నదన్న భ్రమను కలిగించింది. కాని కాకతాళీయంగా ఆ ఊళ్ళోకి ప్రవేశించిన చంద్రంవల్ల ఆ గాజుతలుపులు బ్రద్దలయ్యాయి.

ఓ సారి చెల్లెలింటికి వచ్చిన అన్నయ్యకు దారిలో చంద్రం కనిపించాడు. కుశలప్రశ్నలు వేసి ఇంటికి తీసుకుని వచ్చాడు. అంతవరకూ వల్లి అక్కడ ఉందనే తెలియదతనికి. చిక్కి శల్యావశిష్టమయిన బావని చూచి వల్లి మౌనంగా కన్నీళ్ళు తుడుచుకుంది. కాని అతనిరాక ఇంతటి ఘోర ఫలితానికి దారి తీస్తుందని మాత్రం అనుకోలేదు.

ఆ రాత్రి ఆమెభర్త అనుమానంతో గుచ్చి గుచ్చి అడుగుతూంటే విస్మయంతో 'బావ ఈ ఊరు వచ్చినట్టు నా కింతకు ముందు తెలియనే తెలియ'దని ఎంతగానో చెప్పింది.

"పెళ్ళికిముందు అతన్ని చేసుకోవాలనుకోటం నిజమేనా?"

వల్లి తలూపింది. అంతే. అతనికోపం కట్టలు తెంచుకుంది. వల్లి వళ్ళు హూనమయిపోయింది. ఆఖరికి జుట్టు పట్టుకుని లాగి బయటికి తోసి తలుపులు వేసుకున్నాడు. ఆమె ఎంత బ్రతిమాలుకున్నా నిరర్థకమే అయింది. రాత్రంతా గడపదగ్గరే పడిఉంది. వెలుగుతో పట్టూ జనానికి మొహం చూపలేక అవమానభారంతో క్రుంగిపోయిన ఆమెను అక్కడే వదిలి తలుపుకు తాళం పెట్టి వెళ్ళిపోయాడు తాళిగట్టిన భర్త. అప్పటికె మూడునెల్ల కడుపుతో ఉందామె.

నిస్సహాయురాలిగా వీధిలో నిలబడ వల్లి, తనూ తన సవతి మార్గాన్నే అనుసరించాల్సి ఉంటుందన్న సత్యం గోచరించింది. కాని అంతటి నిరీహ పరిస్థితిలో కూడా చావుని ఆహ్వానించ దలుచుకోలేదామె. బ్రతుకుమీది తీపి ఆమెను వెనక్కి లాగింది. ఈ భూమిమీద బ్రతికే హక్కు తనకెందుకు లేకపోవాలి, కడుపులో కదిలే పాపకోసమయినా సరే తను జీవించి తీరాలి.

కాని ఎలా? ఇహ ఒక్కటే దారి మిగిలిందామెకు. భర్తమాట నిజం చెయ్యటానికి తీర్మానించుకుంది. ఎంతో కష్టం మీద చంద్రం అడ్రసు కనుక్కుంది.

ఈ పరిస్థితుల్లో వల్లిని చూసి నిర్ఘాంతపోయాడు చంద్రం. దానికి పరోక్షంగా తానే కారణమని తెలిసిన్పు డతని విచారాని కంతం లేకపోయింది. నీ భర్తకు నేను నచ్చచెబుతాను. ఇంటికి పదమన్నాడు. వల్లి నిరాశగా నవ్వి తన కిక ఆ ఇంటి ద్వారాలు ఎప్పటికీ తెరుచుకోవని స్పష్టపరిచింది. నిరాశతో కాంతిని కోల్పోయిన అతని కళ్ళలో మెరుపు మెరిసింది. వల్లిని తీసుకుని దూరంగా హైదరాబాదు వచ్చేశాడు. అతి ప్రయత్నం మీద లెక్కలు రాసే గుమాస్తాగా చేరాడు. వల్లిని సుఖపెట్టాలని, అపేక్షగా చూసుకోవాలని అతని ఆరాటం




కాని అతని ఆరోగ్యం ఏమంత బాపుండక పోవటంతో తరచూ జబ్బుచేసేది. తగినంత పోషణ లేకపోవటంతో అతని ఆరోగ్యం పూర్తిగా కోలుకోనేలేదు. హఠాత్తుగా గుండె అగి మరణించాడు. నా అన్నవారు లేని వల్లిని ఈ ప్రపంచంలో వంటరిగా వదలి వెళ్ళిపోయాడు.

ఇది ఆమె కథ. కథలాగానే ఉంది వినటానికి. విని ఓ నిట్టూర్పు వదలటానికి బాగానేఉంది. కాని అందులోని వల్లి నా కళ్ళముందే ఉంది. ఆమె గర్భంలో వెలుగు కోసం ఎదురుచూస్తున్న మరో జీవికూడా ఉంది. నా మనసులో మెదిలిన ఆలోచనలకి అంతులేదు.

ఈమె సంగతంతా తెలిస్తే సమాజం



ఈమెను సానుభూతితో చూపేమాట కల్ల దీన్నంతా నా మనసులోనే దాచుకోవాలని నిశ్చయించుకున్నాను.

"ఏమి టాలోచిస్తున్నారు మామీ! ఈ పతితను చేరదీశానే అని విచారిస్తున్నారా?"

అదిరిపడి చూశాను. వల్లి కళ్ళవెంట ధారాపాతంగా అశ్రువులు ప్రవహిస్తున్నాయి. నా కొంగుతో ఆకన్నీటిని తుడిచి 'మవ్వు నా బిడ్డ' అని నుదుటి మీద ముద్దెట్టుకుని "పరిస్థితుల కెపుడూ మనిషి బానిసవక తప్పటంలేదు. ఇందులో నీ తప్పేముంది? ను వ్వేమీ విచారించకు; నే నున్నాను. నీ ఆరోగ్యం బాగుపడితే అంతేచాలు." అన్నాను.

వల్లి గబుక్కున పైకి లేవబోయింది. పట్టుకు వారించాను.

"నిజం చెప్పండి మామీ! మీ కేం అసహ్యం కలగటంలేదూ నామీద?" అంది ఆయాసంతో రొప్పుతూ. నేను మౌనంగా దుప్పటికప్పి తల నిమురుతూ కూర్చున్నాను. మాట్లాడి అలసిపోయిన వల్లిని నిద్రాదేవి తన వడిలోకి తీసుకుంది. నిద్రపోతున్న ఆమె మొహంచూస్తూ చాలాసేపు అలాగే కూర్చుండిపోయాను. నీరసంతో పాలిపోయిన మొహంతో దీనత్వం ఉట్టిపడుతోంది. ఆ పిల్లనలా చూస్తుంటే నాలోని మమత పొంగి పొరలింది. ఆమె దీనావస్థ నన్ను కరగించివేసింది. ఏనాటి అనుబంధమో మా ఇద్దరిమాధ్యా పెనవేసుకు పోయింది. విధి వంచిత అయిన వల్లిపట్ల నా కర్తవ్యాన్ని నేనే నిర్ణయించుకున్నాను.

రాను రాను వల్లిఆరోగ్యం బాగుపడ సాగింది, ఇహ భరవాలే దనుకున్నాను.

"మామీ! పాప పుట్టాక నే నేదయినా ఉద్యోగం వెతుక్కుంటాను. నా పాపను నా చేతులతోనే పెంచాలి. అదొక్కటే నాకోర్కె. నా కిపుడు చచిపోవాలనిలేదు" అనేది.

"అలాగేనమ్మా, అలాగే చేద్దుగాని. పిల్లల్ని పెంచటానికన్నా తల్లికి కావలసిన దేముంది!" అన్నా,మాతృత్వానికి నోచుకోని నా దురదృష్టాన్ని తల్చుకుంటూ.

"బాధపడుతున్నారా మామీ? నేను మీ పిల్లనేగా" అని మరపించ చూసింది వల్లి

వల్లికి నొప్పులు రాగానే హాస్పిటల్లో అడ్మిట్ చేశాం. మూడురోజులు యమ యాతనపడి ఆడపిల్లను ప్రసవించింది. తరువాత నాలుగురోజులూ చావుబ్రతుకుల మధ్యలో కొట్టుకులాడింది వల్లి. పాపను చూసుకున్న ఆనంద మొక్కటే మిగిలిం దామెకు.

"మామీ! నాకుచావాలనిలేదు. నా పాపను నేనే పెంచాలి. నన్నెలాగైనా బ్రతికించు కోండి. అందుకోసమే బ్రతికాను నేను" అన్న ఆమెమాటలతో నిలువునా నీరయ్యాను. ఆమెబ్రతికే ఆశేమీ లేదని బాగా తెలిసి పోయింది.

ఆమెకూడా ఆ సంగతి తెలిసిందేమో పూడిపోతున్న గొంతు పెగలించుకుంటూ—

"మామీ! నేను చనిపోతే నా పాప నెవరు పెంచుతారు?" అంది.

"............"

"అనాధాశ్రమాని కిస్తారా?" ఉహుఁ. వద్దు మామీ, వద్దు. అలా చెయ్యకండి. మీరు తీసుకోరూ నా పాపని? మీరు పెంచరూ? తల్లి లేని లోటు తీర్చరూ—" ఇహ మాట్లాడలేకపోయింది వల్లి.

"............"

"తీర్చలేని కోర్కె కోరుతున్నా కదూ?" అంది నీరసంగా,

"లేదమ్మా, లేదు. నీకు నయమవు తుంది. అలా కాని పక్షంలో..."

"ఊఁ, అప్పుడు..."

"నీ బిడ్డను నా బిడ్డగా చూసుకుంటాను."


వల్లి సత్తువ కోల్పోయిన తన చేతులతో నా చేతిని పట్టుకుంది. తరువాత మెల్లిగా ఆ చేతులతోనే పాపను నిమిరింది.

"అంతే మామీ! నాక్కావలసిన దంతే. ఇక 'విజయ' మీ పాపే కాని ఏ పరిస్థితు ల్లోనూ మరెవరికీ అప్పగించనని మాటివ్వండి."

ఆమె సందేహ మేమిటో అర్థం కాలేదు నాకు.

"అంటే...పాపకు తండ్రి అంటూ ఒక రున్నారు. వారిక్కడకు వచ్చి పాపను అడిగే ప్రశ్నే లేదు. మళ్ళీ వివాహం చేసు కుని సుఖంగా ఉన్నారు. కాని ఏ పరిస్థి తుల్లోనైనా, ఎప్పటికైనా వా రలా వచ్చి అడిగితే నా పిల్లను వారి కివ్వద్దు." వల్లి కళ్ళు ఎర్రబడ్డాయి. పెదవులు కంపించాయి.

"అలాగే, అలాగే, నువ్వావేశం తెచ్చు కోకు మరి" అని వారించాను.



బ్రతుకుమీద ఆశను. పాపను పెంచాలన్న కోరికను వదలలేక వదలేక కొనవూపిరి తీసింది వల్లి.

పదిరోజుల పసికందును వళ్లో పెట్టుకుని అగాధం మీద పడ్డదానిలా కూర్చున్నాను. మావారు వల్లి సంబంధీకు లెవరున్నారో వాకబుచేసి పిల్లను అప్పగిద్దామన్నారు. అప్పుడే యీ కథంతా ఆయనతో చెప్పి. ''నా కెలాగూ ఈ జన్మలో తల్లినయే భాగ్యంలేదు. ఆయాచితంగా నా వళ్లో పడిన యీ పాపాయిని వదులుకోలేను. వల్లి కిచ్చిన మాట నెరవేర్చటంలో నాతో సహకరించ" మని వేడుకున్నాను.

"ఏం గొడవలొస్తాయో ఏమో" అని నసిగారు ఆయన.

"మనం యీ ఊరు వదిలి వెళ్ళిపోవాలి. ఈ పిల్ల మనదే నన్నా కాదనే వా రెవరు?"

అయిష్టంగానే ఒప్పుకున్నా రాయన? బదిలీ చేయించుకుని ఇంకో ఊరు వెళ్ళిపోయారు. నెలరోజుల పసికందు నా వల్లనే పెరిగి పెద్దయింది. పాపకు పాలు పట్టేటపుడు, పక్కలో పడుకోబెట్టుకుని పడుకునేటపుడు, ఉయ్యాల్లో వేసి నిద్రబుచ్చే టపుడు నే ననుభవించిన ఆనందం అవర్ణనీయం. దానికి సాటిలేదు. విలువ కట్టలేని దది. మెత్తని పాలబుగ్గలకు నా చెంప ఆన్చినప్పటి అనుభూతి ఇంకేమిస్తే వస్తుంది. అమాయకంగా నా వేపు చేతులు చాస్తూ విజయ నవ్వుతున్నప్పుడు నే ననుభవించిన అనుభూతికి మరేది సాటిరాగలదు? ఈ ఆనందమంతా నాకు ప్రసాదించింది వల్లే. కనక ఈ జీవితంలో నాకు లేవనుకున్న, స్త్రీకి అమూల్య మయిన ఆభరణం మాతృత్వం. కనకవల్లి భిక్షవల్లనే లభ్యమయింది. ఎడారిలో ఉన్న మా జీవితంలో విజయ ప్రేమవర్షం కురిపించి, పచ్చగా కళకళ లాడేలా చేసింది.

''అమ్మ అన్న పిలుపుతో వెనుదిరిగి చూశాను. నా కన్నీటి తెరలోనుండి వల్లే నిలబడి 'మామీ' అని పిలుస్తున్నట్టనిపించి. వల్లి స్మృతిచిహ్నం విజయ వచ్చి నా మెడను వాటేసుకుని 'బాగా ఆలస్యమయినట్టుంది కదమ్మ' అంది. నా మనస్సు గతంలోనుండి ప్రస్తుతంలోకి ఊడిపడింది. కన్నీరు తుడుచుకుని నా మెడను వాటేసుకున్న చేతుల్ని విడిపించుకుని పక్కలో కూర్చొబెట్టుకున్నాను.

"ఆలస్యం కాలేదూమరి? ఎంత కంగారు పడ్డాననుకున్నావ్" అంటూ దగ్గరికి తీసుకున్నాను. ఆ స్పర్శ నాలోని కలవరాన్నంతా కడిగి వేసింది